క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నూతన పాలక మండలి సభ్యులు



ఎమ్మెల్యే మేకపాటిని కలిసిన సంగమేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు

సంగం: సంగంలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు సోమవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని మేకపాటి నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛంతో పాటు సంగమేశ్వరస్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీంద్రబాబు, పాలకమండలి సభ్యులు ప్రసాద్, పెంచలయ్య, బుజ్జయ్య, పెంచలయ్య, చిన్న పెంచలయ్య, అక్కయ్య, సోషల్ మీడియా సంగం మండల కన్వీనర్ వేణు తదితరులు ఉన్నారు.

మర్రిపాడు వాసికి గౌరవ డాక్టరేట్



శివశంకరయ్య

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మన్నెళ్లి శివశంకరయ్యకు తమిళనాడులోని హోసూరుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం ఈనెల 30న గౌరవ డాక్టరేట్ (జీవిత సాఫల్య డాక్టరేట్) అందజేయనుంది. దీనికి సంబంధించిన ఆహ్వానపత్రాన్ని సోమవారం ఆయనకు పంపించారు. వివిధ పుస్తకాల రచన, తాళపత్ర గ్రంథాలను సేకరిస్తూ తర్జుమా చేసినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివశంకరయ్య ఐదు బ్యాచ్‌లర్ డిగ్రీలు, ఆరు మాస్టర్ డిగ్రీలు, ఇప్పటికి మూడు డాక్టరేట్లు పొందారు.

డీఎం చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం సమీపంలో డీఎం చానెల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. పసుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సుమారు నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గేదెను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు: బైక్‌పై వస్తూ గేదెను ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్ర గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నెల్లూరుపాళెం వద్ద జరిగింది. స్థానిక వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే ఎం.ఉమేష్ తన ఇంటి నుంచి ఆత్మకూరుకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టి రోడ్డు మీద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గేదె సైతం మృతి చెందింది. క్షతగాత్రుడిని సమీపంలోని ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనం ద్వారా నెల్లూరుకు తరలించారు.

రెండు ఆటోలు ఢీ

సోమశిల: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన సోమశిల సమీపంలో సోమవారం జరిగింది. పాల క్యాన్లతో వెళ్తున్న ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. మరో ఆటోలో ప్రయాణిస్తున్న మస్తాన్, నందిని స్వల్ప గాయాలయ్యాయి.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

ఆత్మకూరు: మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని బీజేపీ నాయకులు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, అళ్ల మధుసూదన్, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

కలిగిరి: కలిగిరిలో మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కల్లూరి చంద్రమౌళి, నాయకులు నందనవనం ప్రభాకర్‌రావు, నరసింహారెడ్డి, మల్లికార్జున్, కృష్ణారెడ్డి, వాకా మాల్యాద్రి పాల్గొన్నారు.

జలదంకి: జలదంకి బస్టాండ్ సెంటర్లో బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్‌బాబు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, మార్లెళ్ల బ్రహ్మారెడ్డి, చల్లా హనుమారెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చేజర్ల, మడపల్లి, చిత్తలూరు గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ చేజర్ల మండల అధ్యక్షుడు జి విజయభాస్కర్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య, నాయకులు ప్రేమ్‌చంద్, మహేష్, భద్రయ్య, కోటిరెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

• సమన్వయకర్త మేకపాటి



మేకపాటిని సన్మానిస్తున్న క్రైస్తవ సోదరులు

ఉదయగిరి: క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి, బర్డిట్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చిల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మత విశ్వాసాలకు అనుగుణంగా సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. ప్రభువు చూపిన మార్గంలో పయనిస్తూ తోటివారిపై దయాగుణం కలిగి ఉండాలన్నారు. క్రైస్తవ సోదరుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు సుధీర్‌కుమార్, అశోక్, జాషువా, ప్రసాదరావు, ఆరోన్, ప్రసాద్‌రావు, గడియాల్చి ఎస్తాని పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్

కావలి: పట్టణంలో సోమవారం భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండగ జరిగింది. పలు చర్చిల్లో ఏసుక్రీస్తు భూమిపై అవతరించిన వైనాన్ని వివరించారు. చిన్నారుల వేషధారణలు మంత్రముగ్ధుల్ని చేశాయి. పలు చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. దయ, సేవాభావం ప్రస్తుత సమాజానికి అవసరమన్నారు. క్రీస్తు ఆశించిన శాంతియుత సమాజాన్ని అభివృద్ధి చేయడానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

బిట్రగుంట: మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. క్రీస్తు రాకను స్వాగతిస్తూ ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో శాంతి గీతాల ఆలాపన, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో సందడి నెలకొంది. బోగోలులో ప్రసిద్ధ తెలుగు బాప్టిస్ట్ చర్చ్, ఆర్‌సీఎం, హోలీ ఫ్యామిలీ, తెలుగు బాప్టిస్ట్ చర్చ్, కప్పరాళ్లతిప్పలోని బోడెన్‌పేట చర్చ్‌ల్లో వేకువ నుంచే నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోని పలు ప్రార్థనా మందిరాల్లో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. క్రీస్తు పుట్టుకను ప్రతిబింబించేలా పలు చర్చ్‌ల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు, చిన్నారుల వేషధారణలు ఆకట్టుకొన్నాయి.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలోని పలు చర్చిల్లో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. క్రైస్తవులు ఉదయం 9 గంటలకే చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ జాన్ ప్రదీప్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు పాపులను రక్షించేందుకే జన్మించారని ఆయన తెలిపిన శాంతి వచనాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. చర్చిలో క్రిస్మస్ కేక్‌ను పంచి పెట్టారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. మహిళలు ప్రార్థనల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మందికిపైగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో పేదలకు దుప్పట్లతో పాటు చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పి ఎడ్వర్డ్, సుజి, బన్ని, సుమియోన్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా క్రిస్మస్ వేడుకలను సోమవారం నిర్వహించుకున్నారు. మండలంలోని కొమ్మి, సత్యవోలు, కొండాపురం, సాయిపేట, తూర్పు బ్రాహ్మణపల్లి, ఎర్రబల్లి, గరిమెనపెంట గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసుక్రీస్తు సందేశాలను, దేవుని వాక్యాలను వినిపించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవీంద్ర తూర్పు బ్రాహ్మణపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అనంతసాగరంలో..

సోమశిల: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే క్రిస్మస్ వేడుకలను సోమవారం అనంతసాగరంతో పాటు సోమశిల, చిలకలమర్రి, మంగుపల్లి, కామిరెడ్డిపాడు, రేవూరు గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ఘనంగా జరుపుకున్నారు. సోమశిలలోని క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో దైవ సేవకులు ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. గీతాలను భక్తులు ఆలపించారు. ప్రార్థనా మందిరాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జలదంకి..

జలదంకి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. అన్ని చర్చిల్లో పాస్టర్లు దేవుని వాక్యాలు, సందేశాలు వినిపించారు. జలదంకిలోని తెలుగు బాప్టిస్టు సంఘం చర్చిలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి ప్రార్థనలు నిర్వహించారు. సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఇందిరమ్మ, సురె వెంకటశేషారెడ్డి పాల్గొన్నారు.

చేజర్లలో

చేజర్ల: చేజర్ల ఎస్టీ కాలనీ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రేమ, త్యాగం, క్షమ, కరుణ అనేవి జీవితానికి అవసరమని, వాటిని పాటించాలని క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరిసింహారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఓర్సు నరసింహ, సుధీర్‌రెడ్డి, ఆత్మకూరు వీరస్వామి తదితరులు ఉన్నారు.

అల్లూరులో..

అల్లూరు: మండలంలోని అన్ని చర్చిల్లో సోమవారం ఘనంగా క్రైస్తవులు క్రిస్మస్ పండగను నిర్వహించారు. చవటపాళెం కాలనీలోని ఏసు అభిషేక మినిస్ట్రీస్ చర్చిలో దేవరకొండ సాముయేలు బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు. అనంతరం 500 మందికి అన్నదానాన్ని నిర్వహించారు.

దుత్తలూరులో..

దుత్తలూరు: మండలంలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. దుత్తలూరు, నర్రవాడ, తెడ్డుపాడు, వెంగనపాళెం, బ్రహ్మేశ్వరం, భైరవరం, రాచవారిపల్లి, నందిపాడు తదితర ప్రాంతాల్లోని చర్చిల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. తెడ్డుపాడులో రిటైర్డ్ డీఎంహెచ్ఓ మాశిలామణి దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వంద మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

సంగంలో..

సంగం: మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దువ్వూరులోని ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా చర్చి ఫాదర్‌లు భక్తులకు దేవుని వ్యాక్యలు వివరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంగం పెన్నా బ్యారేజ్ సమీపంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఉల్లాది పేదనరసింహులు దైవ సందేశాన్ని ఉద్బోధించారు. ఆత్మకూరుకు చెందిన ఎడ్నమ్మ క్రిస్టియన్ మోమెరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కలిగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పర్వదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు జననం, బైబిల్‌లో సూక్తులను వివరించారు. క్రీస్తు పాటలు ఆలపించారు. మత పెద్దలు శాంతి సందేశాన్ని వినిపించారు. పలు ప్రార్థన మందిరాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

వరికుంటపాడులో..

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో కేక్ కట్ చేసిన సంఘ కాపరులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి దైవసందేశాలు వినిపించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడుచుకోవాలని, క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. తోటి వారిపై కరుణ, ప్రేమ, దయ గుణాలు కలిగి ఉండాలన్నారు.

మర్రిపాడులో..

మర్రిపాడు: మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మర్రిపాడులో క్రైస్తవులు ఉదయం నుంచి ప్రార్థనలు చేశారు. చర్చిల ఫాస్టర్లు క్రీస్తు దైవ సందేశాన్ని తెలియజేశారు. క్రీస్తుపుట్టుకతో ప్రపంచ మానవాళిలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని తెచ్చారన్నారు.

ఆత్మకూరు రూరల్‌లో..

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని చెర్లోయడవల్లి, వాశిలి, వెన్నవాడ, బోయలచిరివెళ్ల, తదితర గ్రామాల్లో క్రిస్మస్ ప్రార్థనల్లో సంఘకాపరులు, పెద్దలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్లు స్టీఫెన్, జాన్‌ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



సంగం: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



కలిగిరి: ది లార్డ్ గోస్పెల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



ఆత్మకూరు: దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం



తూర్పు బ్రాహ్మణపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న చిమ్మిలి రవీంద్ర



ఆత్మకూరు: ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



జలదంకి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాలకొండారెడ్డి, తదితరులు



ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీపీ తూమాటి, ఇతర నాయకులు



ప్రార్థన చేస్తున్న చర్చి వ్యవస్థాపకులు దేవరకొండ సాముయేలు బాబు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాశిలామణి

ఆటల పండగకు వేళాయే

• నేటి నుంచి 51 రోజుల పాటు క్రీడా పోటీలు
• ఐదు క్రీడాంశాల్లో 23,393 మంది క్రీడాకారులు నమోదు



క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మంగళవారం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. ఆరు మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలోని 93 సచివాలయాల్లో 51 రోజుల పాటు జరగనున్న క్రీడా పోటీలకు 23,393 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తొలుత మండల స్థాయి, ఆపై నియోజకవర్గం, తర్వాత జిల్లా స్థాయి, చివరకు రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ఒక గ్రామీణ ప్రాంత జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు తలపడి నిలిచే అవకాశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పోటీలు నిర్వహించడంలేదు.

పోటీలు ఇలా

సచివాలయాల స్థాయిలో 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు, నియోజకవర్గ స్థాయిలో జనవరి 24 నుంచి 30 వరకు పోటీలు జరుగనున్నాయి. సచివాలయ స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి ప్రభుత్వం ద్వారా అందనున్నాయి. మండల స్థాయికి ఎంపికైన వారికి టీషర్ట్, క్యాప్, రిస్ట్‌బ్యాండ్ అందించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మొదటి బహుమతి రూ.35 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, బ్యాడ్మింటన్ విభాగంలో మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందించనున్నారు. జిల్లా విభాగంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మొదటి బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, బ్యాడ్మింటన్ విభాగంలో మొదటి బహుమతి రూ.35 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మొదటి బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.2 లక్షలు, బ్యాడ్మింటన్ విభాగంలో మొదటి బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్ష, తృతీయ బహుమతి రూ.50 వేలు అందించనున్నారు. లాంఛనంగా ఆయన ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ప్రారంభించిన విషయం తెలిసిందే.

విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు యువతను ప్రోత్సహించి క్రీడలపై ఆసక్తి పెంచి ఈ పోటీలను విజయవంతం చేయాలి. ఆర్డీఓ, ఎంపీడీఓ మానటరింగ్ చేసుకుంటూ యువత రాష్ట్ర స్థాయి పోటీలకు నిలిచేలా కృషి చేయాలి.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే

పచ్చమీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

• ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి



సోషల్ మీడియా సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వంపై పచ్చ మీడియా చేసే దుష్ప్రచారాన్ని అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వారి కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి సోషల్ మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. వింజమూరులోని ఎస్వీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఉదయగిరి నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసే ప్రతి మంచి పనిని పచ్చమీడియా జాబితాలోని 9 మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నాయన్నారు. ఆయా మీడియాల్లో వచ్చే అబద్ధపు వార్తలను సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నాలో అన్నీ పన్నుతున్నారన్నారు. ఈ మహాసంగ్రామంలో ప్రజలకు మంచి ఏదో, చెడు ఏదో తెలియజేయాల్సిన బాధ్యత సోషల్ మీడియాపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా సోషల మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చర్చ జరిగే విధంగా పనిచేయాలన్నారు. ఉదయగిరిలో ఈ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. స్థానిక సోషల్ మీడియా ప్రతినిధులు ప్రతి పల్లెపల్లెకు తీసుకెళ్లాలని కోరారు. సోషల్ మీడియా ప్రతినిధులు మేకపాటి రాజారెడ్డి, ఆయన తనయుడు అభినవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సోషల్ మీడియా ప్రతినిధులకు రాజారెడ్డి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు గణపం బాలకృష్ణారెడ్డి, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, మద్దూరు బాబు, వాసుదేవరెడ్డి, ఎల్లాల వెంకట్రావు, డి.సమరసింహారెడ్డి, నారసింహారెడ్డి, షేక్ అలీఅహ్మద్, కాటం రవీంద్రారెడ్డి, బొడ్డు మాధవరెడ్డి, పాలవెల్లి మాలకొండారెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తా

• శకునాలపల్లెలో రాజన్న రచ్చబండ



సమస్యలు తెలుసుకుంటున్న మేకపాటి

ఉదయగిరి: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, తాను ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని శకునాలపల్లెలో సోమవారం రాజన్న రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయన రామాలయ వద్ద గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని, వ్యవసాయ పొలాలు, పక్కా గృహాలు ఇప్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించి న్యాయం చేస్తానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు పథకం ద్వారా రాజకీయాలు, కులమతాలకతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఆయనకు మనం రుణపడి ఉన్నామని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా అత్యధిక మెజార్టీతో మళ్లీ సీఎంగా గెలిపించుకుని రుణం తీర్చుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి విన్నవించుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలు చంద్రబాబు పాలనకు ప్రస్తుత సీఎం జగనన్న పాలనను తేడాను గమనించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత మన జగనన్నదేనన్నారు. పేదల ఆరోగ్యం దృష్ట్యా ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చులను రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మాజీ మండల కన్వీనర్లు అక్కి భాస్కరరెడ్డి, మూలే సుబ్బారెడ్డి, నాయకులు అక్కుల్‌రెడ్డి, డి.చెన్నయ్య, లక్ష్మయ్య, జి.వెంగళరెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, సోమిరెడ్డి, కె.రాజగోపాల్‌రెడ్డి, జె.చెన్నకేశవులు,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

11 జలసిరి బోర్లు మంజూరు

సోమశిల: మండలంలోని సోమశిలకు జలసిరిలో పథకం కింద 11 బోర్లు మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కు మస్తాన్‌గౌడ్ తెలిపారు. జలసిరి పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు.

పచ్చిక దొమ్మతో పశువుల మృతి

దుత్తలూరు: మండలంలోని భైరవరం పంచాయతీలో పలు గ్రామాల్లో వారం రోజులుగా పచ్చికదొమ్మ వ్యాధితో 8 పశువులు మృతి చెందాయి. ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం నెల్లూరు నుంచి ప్రత్యేక బృందం వచ్చి రక్త నమూనాలు సేకరించి చనిపోవడానికి కారణాలు తెలుసుకుంటామన్నారు. వ్యాధి నివారణకు వ్యాక్సిన్ అందిస్తామని, పచ్చిక దొమ్మ నివారణ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు.

ఆక్రమణలను అరికట్టండి

ఆత్మకూరు: పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ నాయకులు డేవిడ్‌రాజు, ఎస్‌కే సందానీ, లక్ష్మీపతి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖాళీ స్థలాలతో పాటు ఇరిగేషన్ కాలువలు సైతం ఆక్రమణకు గురవుతున్నాయని, ఆక్రమణదారులకు పలుచోట్ల పక్కా భవనాలు, స్థలాలు ఉన్నా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలకు అద్దెకిస్తున్నారన్నారు. ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్‌లో వ్యాపార గదులను వెంటనే వేలం ద్వారా కేటాయించాలని అంతకుముందు మున్సిపల్ బస్టాండ్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి గతంలో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు గదులు కేటాయించాలని కోరారు.

